# నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు

సన్‌హెడ్రిన్ ఎదుట తీర్పుకై నిలిచినప్పుడు, దేవదూషణ చేసినట్టు యేసుపై నేరం మోపబడింది (మత్తయి 26:65). సివిల్ కోర్టు ఎదుటికి ఆయనను తీసికొని వచ్చినప్పుడు, ఒక క్రొత్త నేరం అవసరమైంది. "- ఇతడు మా జనమును తిరుగబడ ప్రేరేపించుచు, కైసరునకు పన్నియ్యవద్దనియు, తానే క్రీస్తను ఒక రాజుననియు చెప్పగా మేము వింటిమని" వారాయన మీద నేరము మోపసాగారు (లూకా 23:2). ఆ తీర్పు సమయంలో "నీవు యూదులకు రాజువా?" అని పిలాతు ఆయనను అడిగాడు, "నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు" అని ప్రభువు బదులిచ్చాడు (యోహాను 18:33-37).

నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదని క్రీస్తు ప్రకటించిన రాజ్యానికి సువార్త రచనలు మూడు గంభీరమైన గుణ లక్షణాలను నొక్కి చెప్పుతున్నాయి.

## పౌర సంబంధమైన రాజ్యం కాదు

తన స్వభావములో క్రీస్తు రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు. క్రీస్తు తాత్కాలికుడైన రాజుకాదు గనుక ఆయన కైసరునకు విరోధి కాదు. పౌలు దాన్ని వ్యక్త పరచినట్లు, "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు" (రోమా 14:17). "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు" అని ప్రభువైన యేసు తెలిపాడు (లూకా 17:20). దాని స్వభావము ఆత్మ సంబంధమైనదే కాని పదార్థ సంబంధమైనది కాదు. రాజ్యము యొక్క స్వభావమే వెయ్యేండ్ల పరిపాలనా వాదుల భావం తప్పని నిరూపిస్తుంది.

భూమి మీద ఉన్న రాజ్యాలతో సంబంధించినది కాదని యేసు రాజ్య స్వభావం నొక్కి చెప్తుంది. సంఘము, దేశము అనేవి వేరుగా ఉంచబడాలి; ఆ రెండు కలిసిపోలేవు, మూలాంశములోనే ఆ రెండు వేరై పోతాయి. ఈ రెండు రాజ్యాల్లోను ఒకడు పౌరుడై యుండవచ్చు. అతడు దేవునివి దేవునికి, కైసరువి కైసరుకు చెల్లించవలసి యుంటాడు (మత్తయి 12:17; రోమా 13:7; 1 పేతురు 2:17).

కేవలం భూ సంబంధమైన భావంతోనే ఆలోచించగల పిలాతుకు ప్రభువు యొక్క జవాబు అర్థం కాలేదు. అందుకతడు, "నీవు రాజువా?" అని అడిగాడు (యోహాను 18:37). పదార్థ సంబంధమైన భావంతోనే ఆలోచించగలిగే వాడికి, ఈ రాజ్యమును గూర్చిన గొప్ప సత్యాలు అర్థం కావు.

## లోక సంబంధమైన తంత్రముతో కూడింది కాదు

క్రీస్తు రాజ్యము ఈ లోక చాతుర్యానికి సంబంధించినది కాదు. వాస్తవంగా, దానికి సంబంధించిన అనేక విషయాలలో, లోక జ్ఞానం ఉపదేశించడానికి భిన్నంగా దైవ విధానం ఉంటుంది. రాజు యొక్క జననము గాని, ఆయన గృహ జీవితపు పరిస్థితులు గాని లోకం ఎదురు చూసే దానికి బహు భిన్నంగా ఉన్నాయి.

ఎంతగా తెలియబడని, ఎంతటి వినయంగా, ఎంతటి దీనంగా ఆయన జన్మ స్థలముందో! ఆయనకు రాజ భవనంలేదు, పట్టణంలో ప్రవేశించితే రాజ లాంచనపు ఊరేగింపు లేదు, ఆయనకు పరిచర్య చేయడానికి ఏ అధికులు లేరు. నజరేతులో తృణీకరింపబడిన ఒక దీనమైన వడ్రంగి కార్కానాను చిత్రించుకో. ఆ దినాల్లో ఉండే సాధారణ భావాన్ని నతనియేలు ఉదహరిస్తూ, "నజరేతులోనుండి మంచిదేదైనా రాగలదా?" అని అన్నాడు (యోహాను 1:46).

ఆయన రాజ్యానికి ప్రారంభోత్సవంలో సహాయకులుగా ఉండడానికి యేసు కొద్ది మందిని ఏర్పరచుకున్నాడు. ఆయన ధనవంతులనో, తాత్వికులనో, ఏలికలనో కాక, సామాన్య జీవనంలోని పేదలనే ఎన్నుకున్నాడు. త్వరలోనే, ధనము, పలుకుబడి, ఘనత కలిగిన లోకము ఆయనకు విరోధంగా మారిపోయింది (అపొ. 4:26, 27). లోక జ్ఞానం ఎన్నిక చేసికొనే జనానికి ప్రభువు ఎన్నిక చేసికొన్న జనానికి ఎంత వ్యత్యాసముంది! వారసత్వంగా రావడానికి వారికి ఏ విధమైన అవకాశం లేదు.

యెరూషలేములో ప్రారంభోత్సవపు దినాన్ని గూర్చి ఆలోచన చేద్దాం (అపొ. 2). వారి యుద్ధ విజయాల్లో తొలి ప్రసంగాన్ని అపొస్తలులు ప్రకటించారు. వారి వెంట ఆ తరువాత అర్థ శతాబ్దాం వెంటబడితే, ఆవపు గింజలే చెట్లయ్యాయ్ (మత్తయి 13:31, 32). ఎంతటి అద్భుతమైన విజయమది! వారి బలము "లోక సంబంధమైనదా"? అది నిజంగా కాదు! వారి ప్రయాసలకు వెనుక మానవ శక్తిని మించినది ఉంది. మొదటి శతాబ్దపు శిష్యుల విజయానికి భావించగల ఒకే వివరణ, వారు "ఈ లోక సంబంధమైన" వర్తమానం ప్రకటించలేదనేదే. తమ విజయానికి వారు ఆధారపడిన శక్తి "ఈ లోక సంబంధం కానిది."

ఈ రాజ్య ప్రవేశం యొక్క షరత్తులేవి? దాని ఆరంభ దినాన, తన ప్రసంగంచేత ఒప్పింపబడి దోషులుగా తీర్చబడినవారికి, "మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని పేతురు తెలిపాడు (అపొ. 2:38). ఆ రాజ్యంలోనికి ప్రవేశించే మార్గంగా విశ్వాసము, మారుమనస్సు, బాప్తిస్మం అనే మార్గాలను లౌకిక జ్ఞానం సూచించలేదు. మానవ జ్ఞానం బాప్తిస్మాన్నే ఆశించదు! ఆరంభ కార్యముగా బాప్తిస్మానికి అది వ్యతిరేకించి యుండేదే. ఏదియెలాగున్నా, ఈ ప్లాను ఆది శిష్యులచే అనుసరించబడింది – అది యెరూషలేములో మాత్రమే కాదు, ప్రతి స్థలంలో కూడా (అపొ. 8:12, 38; 9:18; 10:48; 16:31–34; 18:8; 19:5). అది "లోక సంబంధము కాని" రాజ్యము.

పైగా ప్రారంభ శిష్యులు జ్ఞాపకాచరణలో ఒక స్మారకాన్ని క్రీస్తు రాజు మరణానికి చిహ్నంగా ఉంచుకున్నారు. అది యొక చిన్న విందు, ప్రభురాత్రి భోజనం (లూకా 22:29, 30; అపో. 20:7; మార్కు 14:22–24): ఆయన శరీరానికి జ్ఞాపకార్థంగా రొట్టె, ఆయన రక్తానికి జ్ఞాపకార్థంగా ద్రాక్షా రసము. మానవ జ్ఞానం నిలిపే జ్ఞాపకార్థ చిహ్నాలు యిలాటివై ఉంటాయా? నరమాత్రుడు ప్రభురాత్రి భోజనాన్ని ప్రారంభించలేదనేది పచ్చి నిజం. అది మానవ సంబంధమైనదికాదు, దైవికమైనదే!

దేవుని కార్యములలోని గొప్ప సూత్రాన్ని గూర్చి పౌలు వ్యాఖ్యానించింది స్పష్టంగా కన్పిస్తుంది:

> ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింప బడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు (1 కొరింథీ. 1:27–29).

"సిలువను గూర్చిన వార్త, నశించుచున్నవారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" అనియు వ్రాశాడు (1 కొరింథీ. 1:18). వారి విజ్ఞాన స్థాయికి అది సరిపోలేదు గనుక క్రీస్తుయొక్క రాజ్యము అనేకులకు ఆటంకంగా ఉంది. లోక జ్ఞానులకు వెర్రితనంగా కన్పించేవాటిని, "ఈ లోక సంబంధం కాని" ఈ రాజ్యపు ఏర్పాట్లుగా దేవుడు కోరుకున్నాడన్న విషయాన్ని మనం ఎప్పటికి గుర్తుంచుకుందాం.

## భూ సంబంధమైన గమ్యం కాదు

కడపటిగా, తన గమ్యంలో ఈ రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు. అది "ఎన్నటికిని లయము కానిది", "నిరంతరము నిలుచునది" (దానియేలు 2:44). "ఆయన రాజ్యము అంతములేనిదై యుండును" అని లూకా 1:33 అంటుంది. "మనము నిశ్చలమైన రాజ్యమును పొంది …" అని హెబ్రీ. 12:28లో మనం చదువుతాం. "చలించే రాజ్యముల మధ్య, గతించిపోయే శక్తులమధ్య, నిరంతరం ఉండే ఒక రాజ్యముందనీ," లోకము అగ్నికి ఆహుతియై పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో కరిగిపోయేటప్పుడు సహితం అది నిలిచే ఉంటుందనీ ఎరగడం మిక్కిలి ఆదరణగా ఉంటుంది.

## ముగింపు

నీవు కావాలని కోరుకుంటే ఈ రాజ్యపు పౌరత్వము నీకు భాగ్యమైయుంటుంది. రాజ్యము స్థాపింపబడినప్పుడు దాని ప్రవేశపు షరత్తులు ఏవో నేటికిని అవే. ఆ షరత్తులేవి? ఒకడు క్రైస్తవుడుగా మారినప్పుడు, అతడు ఆ రాజ్యంలోనికి ప్రవేశిస్తాడు. "దేవుని రాజ్యములో" ప్రవేశించడానికి, "నీటిమూలముగాను ఆత్మ మూలముగాను" జన్మించాలని ప్రభువు తెలియజేశాడు (యోహాను 3:5). తన పరిచర్య యొక్క చివరి కాలంలో ఆయన

దానిని  మరో విధంగా అన్నారు. “నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును…” అని ఆయన ప్రకటించాడు (మార్కు 16:16).